సంపుటి :02 సంచిక :234 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

బుధవారం 19, నవంబర్ 2025


## ఓట్ల పండుగకు
# పల్లెలు సిద్ధం

### పంచాయతీ ఎన్నికలకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్

- డిసెంబర్ రెండో వారంలో నోటిఫికేషన్
- పాత' రిజర్వేషన్ల ప్రకారమే సం`గ్రామం
- గ్రామాల్లో మొదలైన సందడి
- ఆశావహులు, పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం

02





స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా పాత రిజర్వేషన్ల ప్రకారమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, కోర్టు కేసులు తేలాక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుపుతామని ప్రకటించింది. దీంతో స్థానిక సంస్థల మళ్లీ మొదలైంది. డిసెంబర్ రెండవ వారంలో ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం సంకేతాలు ఇవ్వడంతో రాజకీయ పక్షాలు అప్రమత్తమయ్యాయి. గ్రామాల్లో ఆశావహులు కదన రంగంలోకి దూకేందుకు సిద్ధమవుతున్నారు. పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వ ప్రకటన గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించింది.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



### ఇందిరా గాంధీ స్ఫూర్తితో ప్రజాపాలన

- ఆడబిడ్డలందరికీ చీరెలు కానుకగా పంపిణీ చేస్తాం
- మొదటి దశలో గ్రామీణ ప్రాంత మహిళలకు అందజేస్తాం
- మార్చిలో పట్టణ ప్రాంత ఆడబిడ్డలకు ఇస్తాం
- ఇందిరమ్మ చీరెల పంపిణీ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

05





### ఎన్‌కౌంటర్‌లోనే హిడ్మా మృతి

ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా

04

## ఏపీలో మరో
# ఎన్‌కౌంటర్

### మారేడుమిల్లిలో ఏడుగురు మావోయిస్టుల మృతి

- మృతుల్లో ముగ్గురు మహిళలు.. నలుగురు పురుషులు
- మంగళ, బుధవారం ఎదురుకాల్పులను ధ్రువీకరించిన ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ లడ్డా

03

మావోయిస్టు పార్టీ మాస్టర్ మైండ్ హిడ్మా , ఆయన భార్య రాజేతో పాటు మరో నలుగురు మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ఘటన మరువక ముందే బుధవారం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. అదే ఏపీలోని అల్లూరి సీతా రామరాజు జిల్లా రంపచోడవరం అటవీప్రాంతంలోని మారేడుమిల్లిలో తెల్లవా రుజామున భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మృతులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. మృతులను జోగారావు అలియాస్ టెక్ శంకర్, సీత అలియాస్ జ్యోతి, సురేశ్, గణేశ్, వాసు, అనిత, షమ్మి గా గుర్తించారు. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎదురుకాల్పుల అనంతరం భద్రతా దళాలు కూంబింగ్ కొనసాగిస్తూనే ఉన్నాయి. –అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

### లొంగిపోవాలని కోరుతున్నా

మావోయిస్టు పార్టీ మాజీ నేత మల్లోజుల వేణుగోపాల్ పిలుపు



## అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్!

ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన 2.33 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకం

02

- కొనుగోలుదారు పేరిట రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ అధికారులు
- ప్రశ్నిస్తుండటంతో రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేస్తామంటున్న వైనం
- హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో ఘటన



# పీఏసీఎస్ కమిటీ పదవీకాలం పొడిగింపు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పిఏసిఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ (పి ఐ సి) కమిటీ పదవీకాలాన్ని హనుమకొండ జిల్లా సహకార అధికారి పొడిగించారు. మాజీ మేనేజింగ్ కమిటీ సభ్యులు సవాలు చేసిన నేపథ్యంలో హైకోర్టు జారీ చేసిన తాత్కాలిక ఉత్తర్వుల ప్రకారం కమిటీ ఎన్నికలు జరిగే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కొనసాగనుంది. తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టం 21 ఏ ఏ కింద అనర్హులైన వారికి ఈ పొడిగింపు వర్తించదు. పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలో గుండెబోయిన నాగేష్ (చైర్మన్), చందుపట్ల రాజి రెడ్డి( వైస్ చైర్మన్), పంచగిరి శ్రీనివాస్, పిట్ట రమేష్, చెరుపెల్లి సునిధి తదితరంగా మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు.

# తాడిచెర్ల-మల్లారం చెరువు కట్ట మరమ్మత్తులు ప్రారంభం

### ఏఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో పనులు వేగవంతం

అక్షర దర్బార్, మల్హర్: తాడిచెర్ల, మల్లారం గ్రామాల చెరువు కట్ట మరమ్మత్తు పనులు ఏఎంఆర్ సంస్థ ద్వారా ప్రారంభమయ్యాయి. గ్రామస్తుల విన్నపంతో ఏఎంఆర్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి వెంటనే స్పందించగా, ప్రస్తుతం కట్టపై ఉన్న తుమ్మ చెట్ల తొలగింపు పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలో కట్ట రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. పనులు ప్రారంభించినందుకు గ్రామస్తులు, రైతులు ఏఎంఆర్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేనం సతీష్, కుంట సదానందం, పుప్పాల రాజు, కోట దేవేందర్, రేపాల శంకర్, ఏఎంఆర్ ఇన్స్పెక్టర్ రాహుల్ పాల్గొన్నారు.





# అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్!

- ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన 2.33 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకం
- కొనుగోలుదారు పేరిట రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ అధికారులు
- ప్రశ్నిస్తుండటంతో రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేస్తామంటున్న వైనం
- హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో ఘటన




అక్షరదర్బార్, పరకాల: రెవెన్యూ అధికారులు కొందరు తమ స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ నిబంధనలను పాతరేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతూ తమ రూటే సెప'రేట్' అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో ఇలాంటిదే ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. 2017లో అప్పటి ప్రభుత్వం నడికూడ మండలం చౌటుపర్తి గ్రామంలోని బుడమ లక్ష్మికి 2.33 ఎకరాల అసైన్డ్ వ్యవసాయ భూమిని ఇచ్చింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా ఈ భూమిని లక్ష్మి కుటుంబానికి పంపిణీ చేసింది. ఈ భూమిలో వ్యవసాయం చేసుకుని లక్ష్మి కుటుంబం ఫలితాన్ని పొందాల్సి ఉంది. అయితే ఏడాది క్రితం బుడమ లక్ష్మి ప్రభుత్వం తన కుటుంబానికి ఇచ్చిన 2.33 ఎకరాల వ్యవసాయ భూమిని గ్రామంలోని ఓ వ్యక్తికి అమ్మేసింది. ముందుగానే సమాచారం తెలుసుకున్న లక్ష్మి కుమారుల్లో ఒకరైన బుడమ నరసింహ స్వామి తన తల్లి ప్రభుత్వం ఇచ్చిన భూమిని అమ్మేందుకు సిద్ధమైందని, విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలిసి కోరారు. అయినా ప్రభుత్వం బుడమ లక్ష్మికి ఇచ్చిన 2.23 ఎకరాల అసైన్డ్ భూమి అమ్మకం జరిగింది.

### - అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్

ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినందున ఈ అసైన్డ్ భూమిని అమ్మటం, దీనిని కొనుగోలుదారు పేరిట రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేయటం గాని నిబంధనలకు విరుద్ధం. కానీ, బుడమ లక్ష్మి అమ్మిన 2.33 ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలుదారు పేరిట నడికూడ తహసిల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన అసైన్డ్ భూమిని తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేయటాన్ని బుడమ లక్ష్మి రెండో కొడుకు నరసింహ స్వామి తప్పు పట్టారు. తన తల్లి అసైన్డ్ భూమిని అమ్మటమే తప్పని, ఆ భూమిని మరో వ్యక్తి పేరు మీద ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని అతను రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. అక్రమమైనందున తన తల్లి మూడో కొడుకుతో కలిసి అసైన్డ్ భూమిని అమ్మేసిందని, అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలని నరసింహస్వామి పలుమార్లు నడికూడ తాసిల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి కోరారు. నడికూడ తహసిల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ శివ ఈ అక్రమ రిజిస్ట్రేషన్ లో కీలక పాత్ర వహించాడని, శివ ఈ కార్యాలయంలో అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలున్న విషయాన్ని ప్రస్తావించారు.

### - రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం

బుడమ లక్ష్మి రెండో కొడుకు నరసింహస్వామి తాజాగా బుధవారం నడికూడ తహసిల్దార్ రాణిని కలిశారు. ప్రభుత్వం తమ కుటుంబానికి ఇచ్చిన భూమిని తన తల్లి ఓ వ్యక్తికి విక్రయించటం, కొనుగోలుదారు పేరిట అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేయడం నిబంధనలకు విరుద్ధమైనందున రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో 2.33 ఎకరాలు రిజిస్ట్రేషన్ ను రద్దు చేస్తామని తాసిల్దార్ రాణి పేర్కొన్నట్లు నరసింహ స్వామి 'అక్షరదర్బార్' కు చెప్పారు. ఇలా వివిధ గ్రామాల్లో ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా పంపిణీ చేసిన అసైన్డ్ వ్యవసాయ భూములను కొందరు అమ్ముకోగా రెవెన్యూ అధికారులు కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తుంది.

# ఓట్ల పండుగకు పల్లెలు సిద్ధం

- పంచాయతీ ఎన్నికలకు సర్కార్ గ్రీన్ సిగ్నల్
- డిసెంబర్ రెండో వారంలో నోటిఫికేషన్
- పాత' రిజర్వేషన్ల ప్రకారమే సం`గ్రామం
- ఆశావహులు, పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా పాత రిజర్వేషన్ల ప్రకారమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, కోర్టు కేసులు తేలాక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుపుతామని ప్రకటించింది. దీంతో స్థానిక సంస్థల మళ్లీ మొదలైంది. డిసెంబర్ రెండవ వారంలో ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం సంకేతాలు ఇవ్వడంతో రాజకీయ పక్షాలు అప్రమత్తమయ్యాయి. గ్రామాల్లో ఆశావహులు కదన రంగంలోకి దూకేందుకు సిద్ధమవుతున్నారు.

### - 2018 పంచాయతీ ఎన్నికల్లో

2018లో జరిగిన పంచాయతీ ఎన్నికలు కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత జరిగాయి.నాటి గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా 12,751 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,13,875 వార్డులు ఉన్నాయి. అత్యధిక పంచాయతీలు, వార్డులు నల్లగొండ, మహబూబ్‌నగర్ వంటి ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉండేవి. 2014 తర్వాత తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగి, వాటి సంఖ్య 10 నుంచి 33కి చేరింది. ఫలితంగా నాడు పంచాయతీల సంఖ్య కూడా స్వల్పంగా పెరిగింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఈసారి కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు వర్తించే అవకాశం కనిపిస్తున్నది. బీసీ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం పరిమితిని మించడం వీలు కాదు కాబట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ పరంగా పంచాయతీ ఎన్నికలకు వెళ్తామంటున్నది. అలా అయితే.. కాంగ్రెస్ అధిష్ఠానం జనరల్ స్థానాల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇస్తుందా.. లేదా మరేదైనా ఎత్తుగడ అవలంబిస్తుందా? అనేది వేచి చూడాల్సిందే.

### - ఎన్నికలు పూర్తయితేనే ఆర్థిక సంఘం నిధులు

ప్రభుత్వం రిజర్వేషన్లు 50 శాతం లోపు ఉండేలా గ్రామాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రత్యేక కమిషన్‌ను కోరనుంది. ఈ కమిషన్ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి వారం రోజులు పడుతుందని అంచనా. అది అందిన మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఈ ఎన్నికలు నిర్వహించకుంటే ఆర్థిక సంఘం నిధులు రూ.3 వేల కోట్లు ముగిగిపోనున్న నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో డిసెంబరు 15 కల్లా పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి నిధుల కోసం ఆర్థిక సంఘానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

# మల్హర్ మండలంలో పుట్ట మధు పర్యటన

### బాధిత కుటుంబాల పరామర్శ- వధూవరులకు ఆశీర్వాదం



అక్షర దర్బార్, మల్హర్: మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మల్హర్ మండలంలో పర్యటించారు. రుద్రారం గ్రామానికి చెందిన అప్పల ఐలయ్య, మల్లారం గ్రామానికి చెందిన చట్లాపెల్లి పురుషోత్తం ఇటీవల మరణించిన నేపథ్యంలో వారి కుటుంబాలను పరామర్శించారు. అదే గ్రామంలో జరిగిన కొమ్మిడి రాజ్‌కుమార్ రెడ్డి – రేష్మా వివాహ రిసెప్షన్‌లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు, రామారావు, హరీష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

# కమ్మరిగూడెంలో అంగన్వాడీ భవనం నిర్మించాలి

### : జి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర



అక్షర దర్బార్, నూగూరు–వెంకటాపురం: కమ్మరిగూడెం గ్రామంలో అంగన్వాడి భవనం లేక చిన్నారులు అద్దె గదిలో ఇబ్బందులు పడుతున్నందున వెంటనే నూతన భవనం నిర్మించాలని జి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్ చేశారు. బెస్త గూడెం అంగన్వాడి కేంద్రం దెబ్బతిన్నందున మరమ్మతులు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో అంగన్వాడి వసతులు మెరుగుపరచాలని ప్రభుత్వం స్పందించాల్సిందిగా కోరారు.సమావేశంలో నాగరాజు, అనీల్, వంశి తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థిక చేయూత

అక్షర దర్బార్, వెంకటాపూర్ : వెంకటాపూర్ మండలం పాలంపేటకు చెందిన సయ్యద్ ఫయాజ్ అక్టోబర్‌లో ఆకస్మికంగా మరణించడంతో, అతని కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడేందుకు బాల్య మిత్రులు ముందుకు వచ్చారు. 2003–04 విద్యాసంవత్సరం శ్రీ అరవింద విద్యా మందిర్ ములుగు పాఠశాలలో పదవ తరగతి చదివిన 80 మంది మిత్రులు కలిసి రూ.1,08,000ను ఫయాజ్ కూతురు పేరుతో సుకన్య సమృద్ధి యోజన ఖాతాలో జమ చేశారు. అలాగే ఫయాజ్ పిల్లల విద్య కోసం, మిత్రుల అభ్యర్థన మేరకు వేదవ్యాస హైస్కూల్ కరస్పాండెంట్ పోశాల వీరమల్లు ఈ విద్యా సంవత్సరానికి స్కూల్ ఫీజును మాఫీ చేశారు. పాలంపేట–వెంకటాపూర్ మధ్య వ్యాన్ ఫీజుగా రూ.10వేలు మరో మిత్రుడు దుగ్గిరెడ్డి సురేందర్ రెడ్డి అందించారు. 21 ఏళ్ల తర్వాత కూడా బాల్యమిత్రులు చూపిన ఆదరణపై ఫయాజ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మరొక మిత్రుడు భూక్య సునీల్ మరణించినప్పుడు కూడా ₹1,36,000 ఆర్థిక సహాయం చేసినట్లు కమిటీ సభ్యులు గుర్తుచేశారు. భవిష్యత్తులో కూడా మిత్రుల సహాయానికి ఎల్లప్పుడూ నిలబడతామని తెలిపారు. కార్యక్రమంలో మలిశెట్టి స్వాతి, సిరివెన్నెల, అన్నం మోహన్ కుమార్, దేవరాజ్, విక్రమ్ రాజ్, తిరుపతి, రాజన్న, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.





# ఏపీలో మరో ఎన్ కౌంటర్

- మారేడుమిల్లిలో ఏడుగురు మావోయిస్టుల మృతి
- మృతుల్లో ముగ్గురు మహిళలు.. నలుగురు పురుషులు
- మంగళ, బుధవారం ఎదురుకాల్పులను ధ్రువీకరించిన ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ లడ్డా



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి
మావోయిస్టు పార్టీ మాస్టర్ మైండ్ హిడ్మా, ఆయన భార్య రాజేతో పాటు మరో నలుగురు మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ఘటన మరువకముందే బుధవారం మరో ఎన్కౌంటర్ జరిగింది. అదే ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీప్రాంతంలోని మారేడుమిల్లిలో తెల్లవారుజామున భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మృతులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. మృతులను జోగారావు అలియాస్ టెక్ శంకర్, సీత అలియాస్ జ్యోతి, సురేశ్, గణేశ్, వాసు, అనిత, షమ్మిగా గుర్తించారు. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎదురుకాల్పుల అనంతరం భద్రతా దళాలు కూంబింగ్ కొనసాగిస్తూనే ఉన్నాయి.

## ఎన్ కౌంటర్లోనే హిడ్మా మృతి : ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లను ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా ధ్రువీకరించారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పీఎల్జీఏ కమాండర్, మావోయిస్టు పార్టీ మాస్టర్ మైండ్ హిడ్మాను పట్టుకుని చంపారనే ఆరోపణల్లో నిజం లేదని, ఆయన ఎదురుకాల్పుల్లో మృతి చెందాడని స్పష్టం చేశారు. మిగిలిన మావోయిస్టులు కూడా వెంటనే పోలీసుల ఎదుట లొంగిపోతే మంచిదని హితవు పలికారు. ఎంతోమంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి ఏపీకి రావడానికి ప్రయత్నిస్తున్నారని తమకు సమాచారం అందిందని, ఆ సమాచారం ప్రకారం తాము అప్రమత్తమయ్యామన్నారు. మంగళవారం ఆక్టోపస్, ఇంటెలిజెన్స్ జాయింట్ ఆపరేషన్లో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మంది మావోయిస్టు పార్టీ దళ సభ్యులు అరెస్టు చేశామన్నారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్లు ఐదుగురు, ఏరియా కమిటీ మెంబర్లు 19 మంది ఉన్నారని తేల్చిచెప్పారు. మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మావోయిస్టు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తున్నామని వెల్లడించారు.

## - లొంగిపోవాలని కోరుతున్నా

### మావోయిస్టు పార్టీ మాజీ నేత మల్లోజుల

అడవి ప్రాంతాల్లో తలదాచుకుంటున్న ప్రతి మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నట్లు మావోయిస్టు దళ మాజీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో బుధవారం ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. మంగళవారం ఎన్‌కౌంటర్‌లో హిడ్మా సహా ఆరుగురు చనిపోవడం తనను కలచివేసిందని పేర్కొన్నారు. మారిన పరిస్థితుల దృష్ట్యా సాయుధ పోరాటం కొనసాగించలేమని ఉద్ఘాటించారు. ప్రతి మావోయిస్టు జన జీవన స్రవంతిలో కలిసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సి ఉందని నొక్కి చెప్పారు. రాజ్యాంగబద్ధంగా పోరాటం సాగించాలని అభిప్రాయపడ్డారు. 'దేశంలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతున్నాయి.. దేశం కూడా మారుతోంది. ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతో పాటు పలువురి ప్రాణాలు పోయాయి. మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించింది. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు నన్ను సంప్రదించొచ్చు. నా ఫోన్ నంబర్ 8856038533కు కాల్ చేసి మాట్లాడొచ్చు' అని మల్లోజుల పిలుపునిచ్చారు.

# కోర్టు ఎదుట 50 మంది మావోయిస్టులు హాజరు

అక్షరదర్బార్, విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు జిల్లాల్లో మంగళవారం అరెస్టయిన 50 మంది మావోయిస్టులను పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపర్చారు. అంతకుముందు వైద్య పరీక్షల నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు. వీరికి కోర్టు రిమాండ్ విధించింది.



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. మరోవైపు అదే సమయంలో ఏలూరు, కాకినాడ, విజయవాడలలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీని ఆధారంగా ఆయా నగరాల్లోని ఆ ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించి.. భారీగా మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు.



# వాడ బలిజలకు కుల సర్టిఫికెట్లు జారీ చేయాలి

### : రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్

అక్షర దర్బార్, నూగూరు–వెంకటాపురం: మంచిర్యాల జిల్లాలో వాడ బలిజ కులస్తులకు కుల సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయాలని తెలంగాణ వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్ డిమాండ్ చేశారు. మంచిర్యాలలో ఎమ్మార్వో రఫతుల్ల హుస్సేన్‌కు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. డర్ర దామోదర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వాడ బలిజలకు సర్టిఫికెట్లు జారీ చేస్తుండగా, మంచిర్యాలలో మాత్రం ఓడ బలిజ స్థానంలో 'ఓడ బెస్త' సర్టిఫికెట్లు ఇస్తుండటం అన్యాయమని పేర్కొన్నారు. పక్క జిల్లాలైన కొమరం భీం, కావటాల మండలాల్లో కూడా వాడ బలిజగా ధృవీకరణ జారీ చేసినప్పుడు ఇక్కడ ఎందుకు జారీ చేయడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు, రాష్ట్ర కార్యదర్శి బోడెంకి చందు, గార శంకర్, బోడెంకి మహేష్, గగ్గూరి రాజన్న, వాజేడు మండల అధ్యక్షుడు నాగార్జున, బద్ధి ఆదినారాయణ పాల్గొన్నారు.

# ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై విచారణ జరపాలి

### : డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాంత్



అక్షర దర్బార్, మల్హర్ : ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు అనుమానాలున్నందున ప్రిన్సిపాల్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారిపై సమగ్ర విచారణ జరపాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆత్మూరీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గత సంవత్సరం వచ్చిన రూ.20 లక్షల నిధుల ఖర్చుపై జిల్లా విద్యాశాఖ సమాచారం ఇవ్వకపోవడం, ఆడిట్ రికార్డులు బయటపెట్టకపోవడం అవినీతి అనుమానాలకు బలం చేకూరుస్తోందన్నారు. నిధుల అవినీతి నిర్ధారణ అయితే ప్రిన్సిపాల్–జిల్లా విద్యాధికారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని, దారి మళ్లించిన నిధులను వసూలు చేసి స్కూల్ అభివృద్ధికి వినియోగించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందన రాకపోతే భారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.




# ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి

- ఎస్సై చల్లా రాజు
- వాకర్స్ కు టీషర్టుల పంపిణీ

అక్షర దర్బార్, వెంకటాపూర్ : ప్రతిరోజు వ్యాయామం ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమని వెంకటాపూర్ మండల ఎస్సై చల్లా రాజు అన్నారు. బుధవారం ఉదయం మండల కేంద్రంలోని ఉదయనడక కార్యక్రమంలో పాల్గొని వాకర్స్‌కు ప్రత్యేకంగా ముద్రించిన టీషర్టులను ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై చల్లా రాజు మాట్లాడుతూ.. నిత్య నడక శరీరాన్ని చురుకుగా, మనసును ప్రశాంతంగా ఉంచుతుందని, యువత రోజువారీ జీవితంలో వ్యాయామాన్ని తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. మామిడిశెట్టి కోటి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం అరగంట వ్యాయామానికి సమయం కేటాయించాలని అన్నారు. అనంతరం వాకర్స్ టీమ్ కు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బానోత్ యోగి, అజ్మీర రమేష్, మంద రమేష్, వడ్డేపల్లి నగేష్, రెడ్డి శ్రీధర్, ఆకుల సుమన్, పల్నాటి కోటి, మామిడిశెట్టి ధర్మతేజ, పసునూటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## జూకల్ పాఠశాలను సందర్శించిన అధికారులు

అక్షర దర్బార్, చిట్యాల: జూకల్ జెడ్పీహెచ్ఎస్‌ను విద్యాధికారులు బుధవారం పరిశీలించారు. వరంగల్ జిల్లా డైట్ ప్రిన్సిపాల్ అబ్దుల్ హై, భూపాలపల్లి జిల్లా సీఎంఓ రమేష్ స్పెషల్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా పాఠశాల పరిశుభ్రత, పర్యావరణ సదుపాయాలు, భద్రతా చర్యలను సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, శౌచాలయాలు, భద్రతా గదులు వంటి విభాగాలను పరిశీలించిన వారు పాఠశాల శుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు.



## సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించాలి

**: ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి**

అక్షర దర్బార్, పరకాల : వెల్లంపల్లి గ్రామంలోని మిర్చి పంటల్లో పెరుగుతున్న తామర పురుగు, నల్లి నియంత్రణపై రైతులకు సూచనలు అందించినట్టు వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. పురుగుల ప్రబలతను తగ్గించేందుకు రసాయన, జీవ, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. తామర పురుగు, నల్లిపై నియంత్రణ కోసం మోడ్ ఆఫ్ యాక్షన్ రోటేషన్‌తో రసాయనాల వినియోగం, పసుపు–నీలి స్టికీ ట్రాప్స్, ఫెరోమోన్ ట్రాప్స్, వేపనూనె, సబ్బు ద్రావణం, ప్రిడేటరీ మైట్స్ వాడకం ప్రభావవంతమని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమరాతి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి అహ్మద్ రజా, రైతులు రావుల విజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, రేవూరి పాపి రెడ్డి, లక్కర్సు మహేందర్, లక్కిడి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## వయోవృద్ధులు దేశానికి వెలకట్టలేని సంపద

**జిల్లా సంక్షేమ అధికారి తుల రవి**

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ములుగులో ఏరియా ఆస్పత్రి నుండి కలెక్టరేట్ వరకు వయోవృద్ధుల హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి తుల రవి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో తుల రవి మాట్లాడుతూ, "వయోవృద్ధులే దేశానికి వెలకట్టలేని సంపద. వారిని బలహీనులుగా కాక, సమాజానికి పునాది గా చూడాలని అన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధుల ఫోరం నాయకులు, డిసిపిఓ ఓంకార్, శాఖ ఇన్‌చార్జి నాగేంద్ర, ఎఫ్ఆర్ఓ గణేష్, రమాదేవి, సఖి బృందం, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## డీటీడీఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : ఎల్‌హెచ్‌పీఎస్

అక్షర దర్బార్, హనుమకొండ : హనుమకొండ, జనగామ జిల్లాల డిప్యూటీ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీటీడీఓ) నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన డిప్యూటేషన్లను రద్దు చేయాలని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులు రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ సర్వేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మల్టీ జోన్ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ఒక జోన్‌లోని ఉపాధ్యాయులను మరో జోన్‌కు డిప్యూటేషన్లు ఇవ్వడం ద్వారా గిరిజన పాఠశాలల్లో విద్యను డీటీడీఓ అస్తవ్యస్తం చేస్తున్నారని నాయకులు బానోతు సునీల్ నాయక్, అజ్మీరా వెంకట్ నాయక్ ఆరోపించారు. డీటీడీఓ అవినీతికి పాల్పడుతూ, గిరిజన విద్యార్థులకు సరిగా వసతులు కల్పించకపోయినా చర్యలు తీసుకోవడం లేదని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నాయక్, భాస్కర్ నాయక్, నందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# పారదర్శకంగా 'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక

**: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

అక్షర దర్బార్, భూపాలపల్లి : అర్హులైన నిరుపేదలను పూర్తిగా పారదర్శకతతో ఇందిరమ్మ రెండు పడకల ఇళ్లకు ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో భాస్కరగడ్డ వద్ద నిర్మించిన 416 ఇళ్లలో 409 మందికి లబ్ధిదారుల ఎంపికను ఆయన కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి డ్రా ద్వారా కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రారంభించి ఆగిపోయిన 1800 ఇళ్లను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అనుమతితో రూ.170 కోట్లు మంజూరు చేశారని, అవసరమైతే డీఎంఎఫ్టీ నిధుల ద్వారా కూడా మరిన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ప్రభుత్వం నిబంధనల ప్రకారం నాలుగు దశల్లో విచారణ జరిపి అర్హులైన పేద కుటుంబాలను ఎంపిక చేశామని తెలిపారు. నేడు నిర్వహించిన పట్టాల పంపిణీలో 390 మందికి ఇళ్లు కేటాయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొంపల్లి, గుడాడ్‌పల్లి, నేరేడుపల్లి, గొర్లవీడు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని ఆయన రైతులను కోరారు. అనంతరం గొర్లవీడు గ్రామంలోని కొత్త కమ్యూనిటీ టాయిలెట్‌ను కూడా ప్రారంభించారు.

### సర్దార్ @150 యూనిటీ మార్చ్ నిర్వహణ

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని సర్దార్ @150 యూనిటీ మార్చ్ ను నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం అంబేద్కర్ స్టేడియం నుంచి జయశంకర్ సెంటర్ వరకు మేరా యువ భారత్ పోర్టల్ ఆధ్వర్యంలో జరిగిన యూనిటీ మార్చ్ కు ఎమ్మెల్యే గండ్ర, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. జాతీయ సమగ్రత, ఏకతను వేడుకగా జరుపుకునే కార్యక్రమమే యూనిటీ మార్చ్ అని పేర్కొన్నారు.

## 24న మూడు మండలాల స్థాయి ప్రతిభాపాటవ పోటీలు

**అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్**

అక్షర దర్బార్, చిట్యాల : ఈనెల 24న చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మూడు మండలాల స్థాయి ప్రతిభా–పాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్ తెలిపారు. బుధవారం చిట్యాల మండల కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని జరిగిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఏఐఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రతినిధి దొడ్డి కిష్టయ్య మాట్లాడుతూ.. పోటీలు నవంబర్ 24న ఉదయం 10.30 గంటలకు చిట్యాల జడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభమవుతాయని తెలిపారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ధృవీకరించిన పేర్ల జాబితాతో వచ్చి నమోదు చేసుకోవచ్చని చెప్పారు. 12 గంటలకు – వ్యాసరచన (అంబేద్కర్ సాధించిన విజయాలు), మధ్యాహ్నం 2–4 గంటల వరకు – పాటలు (దేశభక్తి గేయాలు), ఉపన్యాస



పోటీ అంశం (భారత రాజ్యాంగం అవసరత) ఉంటాయని తెలిపారు. విజేతలకు బహుమతులు నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవ సభలో ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో పుల్ల ప్రతాప్, కాట్కూరి రాజు, గురుకుల కిరణ్, గడ్డం సదానందం తదితరులు పాల్గొన్నారు.



## 6 ఏళ్లలోపు పిల్లలను అంగన్వాడీకి పంపాలి

**ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద**

అక్షర దర్బార్, చిట్యాల: చైన్‌పాక అంగన్వాడీ కేంద్రంలో జరిగిన తల్లుల సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద మాట్లాడుతూ 3–6 ఏళ్ల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీకి పంపాలని కోరారు. పిల్లల బరువులు ప్రతి నెల మొదటి తేదీన కొలవాలని, బాల్యవివాహాలు, బాలికలపై హింసని అరికట్టాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్ ప్రభుత్వ పాఠశాలలలోనే మంచి విద్య లభిస్తుందని తెలిపారు. సెక్రటరీ పవన్‌కుమార్ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# అజ్ఞాని హరీష్ రావు

- ఉనికి చాటుకోవడానికి మార్కెట్ల సుదర్శన
- కవిత మాటలకు హరీష్ రావు సమాధానం చెప్పాలి
- ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు

అక్షరదర్బార్, హనుమకొండ: సీసీఐ ఎవరి పరిధిలో ఉందో కనీస అవగాహన లేని అజ్ఞాని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు. సీసీఐతో చర్చలకు ముఖ్యమంత్రి ఉన్నారనే విషయం తెలిసి కపట వేషాలు వేస్తున్నారని మండిపడ్డారు.



బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించి వ్యవసాయ మార్కెట్ లను సందర్శించిన నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, నాగరాజు హనుమకొండలోని డీసీసీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులను రెచ్చగొట్టి హరీష్ రావు, కేసీఆర్ వారి చావులకు కారణమయ్యారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు రైతులను రెచ్చగొట్టి తెలంగాణ రాష్ట్రంలో రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉనికిని చాటే ప్రక్రియలో భాగంగానే హరీష్ రావు మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మార్కెట్లను సందర్శించారని విమర్శించారు. బీజేపీకి లోపాయికారిగా పనిచేసే హరీష్ రావు ఆ పార్టీని విమర్శించడం లేదని అన్నారు. ఎమ్మెల్యే హరీష్ రావు ఎమ్మెల్సీ కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల దెబ్బకు బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్ బిల్లా రంగాల మాదిరిగా రాష్ట్రంలో పర్యటనకు బయలుదేరారని విమర్శించారు. మంగళవారం ఒకరు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తే మరొకరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తిరిగారని అన్నారు. హరీష్ రావు రూ.600 కోట్లను అప్పనంగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం పేరుతో దోచుకున్నాడని సొంత పార్టీ, కుటుంబ సభ్యులే ఆరోపిస్తున్నారని అన్నారు. కపట సూత్రధారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులను కోరారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ దోచుకోవడాలు, దోపిడీ తగ్గించాలని సూచన చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# ఇందిరా గాంధీ స్ఫూర్తితో ప్రజాపాలన

- ఆడబిడ్డలందరికీ చీరెలు కానుకగా పంపిణీ చేస్తాం
- మొదటి దశలో గ్రామీణ ప్రాంత మహిళలకు అందజేస్తాం
- మార్చిలో పట్టణ ఆడబిడ్డలకు ఇస్తాం
- ఇందిరమ్మ చీరెల పంపిణీ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్లోని నెక్లెస్ రోడ్ ఇందిరా విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. నేటి నుంచి డిసెంబర్ 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరెల పంపిణీ ప్రక్రియ చేపడతామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదర్భంగా మార్చి 1 నుంచి 8 వరకు నగరాలు, పట్టణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. పంపిణీ పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరలు అందుతాయని వివరించారు. ప్రజా ప్రభుత్వం మహిళల ఉన్నతి కోసం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించామని తెలిపారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు కూడా ఇందిరమ్మ చీర కట్టుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులే బ్రాండ్ అంబాసిడర్గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలని విజ్ఞప్తి చేశారు.






# సీనియర్ పాత్రికేయుడు, ఫొటోగ్రాఫర్ వెంకన్న మృతి

## నివాళులు అర్పించిన జర్నలిస్టులు ఫొటోగ్రాఫర్లు

అక్షర దర్బార్ వెంకటాపూర్ : మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పాత్రికేయుడు, సీనియర్ ఫొటోగ్రాఫర్ మోడేం వెంకటేశ్వర్లు ఆకస్మికంగా మృతి చెందాడు. వెంకటాపూర్ మండలంలో సుమారు 15 సంవత్సరాలు పాటు ప్రముఖ దినపత్రికలో పాత్రికేయుడుగా పనిచేసి అందరి మనల్ని పొందాడు. ఫొటోగ్రాఫర్ గా తన జీవన శైలిని కొనసాగుచుండగా ప్రతి సంవత్సరం అత్యాధునికమైన పరికరాలు మార్చడం వల్ల పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు ఏర్పడ్డాయి, దీంతో కుటుంబంతో హైదరాబాద్ కు వలస వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఆకస్మికంగా గుండెపోటుకు గురై మరణించాడు. వెంకన్న మరణ వార్త తెలుసుకున్న ప్రముఖ జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు ఆయన భౌతిక దేహానికి నివాళులర్పించారు. కాగా ఫొటోగ్రాఫర్ యూనియన్ నాయకులు వెంకన్న కుటుంబానికి రూ.60 వేల చెక్కును అందించారు, కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షఫీ అహ్మద్, ఉపాధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, దూడబోయిన రాకేష్, పిల్లలమర్రి రాము, దేశిని మహేందర్, వినీల్, భానోత్ యోగి,రవిరాజా, వేముల సతీష్ గౌడ్, బాలాజీ రవి ఉన్నారు.







# ఘనంగాఇందిరా గాంధీ జయంతి వేడుకలు

అక్షరదర్బార్, నర్సంపేట: భారత తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 108వ జయంతి సందర్భంగా నర్సంపేట కాంగ్రెస్ కార్యాలయంలో జరిగించిన వేడుకల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “దేశ అభివృద్ధి కోసం ఇందిరమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయం. సమానత్వం, స్వయం సమృద్ధి కోసం ఆమె చేసిన కృషి తరాలకు ఆదర్శం” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓర్సు తిరుపతి, కర్నాటి పార్వతమ్మ, ఎర్ర యాకుబ్ రెడ్డి, తుమ్మలపెల్లి సందీప్, పంబి వంశీకృష్ణ, బైరి మురళీ, దేవండ్ల రాంబాబు, ముత్తినేని వెంకన్న, ధోని కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## శాయంపేటలో..

అక్షర దర్బార్, శాయంపేట: దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో చిత్రపటానికి మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో ప్రజా పాలన కూడా ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో వైనాల కుమారస్వామి, చిందం రవి, నిమ్మల రమేష్, బాసని మార్కండేయ, బాసని రవి, మారపల్లి కట్టయ్య, పలుపదాసు వెంకటరమణ, ఎండి రఫీ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాలలో..

అక్షర దర్బార్, చిట్యాల: ఉక్కుమహిళ, దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని చిట్యాల మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మధువంశీ కృష్ణ మాట్లాడుతూ “పేదల అభ్యుదయం, దేశ సమగ్రత కోసం జీవితాంతం శ్రమించిన నేత ఇందిరా గాంధీ. బ్యాంకుల జాతీయీకరణతో పేదలకు ఆర్థిక సేవలను చేరువ చేశారు” అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చిలుకల రాయకోమురు, దొడ్డి కిష్టయ్య, గడ్డం కొమురయ్య, గుమ్మడి సత్యనారాయణ, అరెపెల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వనభోజనం మహోత్సవం

అక్షర దర్బార్ నల్లబెల్లి : మండలంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాసం వన భోజనా మహోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలోని మాదన్నపేట చెరువు దగ్గర శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో నల్లబెల్లి మండల సంఘం కుటుంబ సభ్యులందరూ ఆటపాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, నల్లబెల్లి మండల అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు మురికి రవీందర్, యూత్ అధ్యక్షుడు రామిని సంతోష్, మహిళా సంఘ అధ్యక్షురాలు గందె శ్రీలత,ఆర్యవైశ్య సంఘ సభ్యులు , మహిళా సంఘ సభ్యులు తదితరులు హాజరయ్యారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915